**శ్రీ రమణ జ్యోతి**
మార్చి 2017

**Sri Ramana Jyothi**
March 2017

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | సంపాదకీయం | సీతంరాజు వెంకట రాజేశ్వర్ | 3 |
| 2. | కె.యస్. గారి 39వ ప్రవచనం | తాడిమేటి సత్యనారాయణ | 5 |
| 3. | శ్రీ శంకరాచార్య | పింగళి సూర్యసుందరం | 16 |
| 4. | గుట్టం సుబ్బరామయ్య | పామరాజు వెంకట లావణ్య రావు | 22 |
| 5. | ఉపదేశసారం | పింగళి సూర్యసుందరం | 30 |
| 6. | భగవాన్ పాదసన్నిధిలో | జి. శ్రీహరి రావు | 32 |
| 7. | మంగళం | ప్రణవానంద | 33 |
| 8. | The Simplicity of it All | Prof. K. Swaminathan | 34 |
| 9. | Happiness Results When Seeking Stops | Dr. K. Subramanian | 38 |
| 11. | True Knowledge | V. Krithivasan | 41 |
| 10. | A Quiet, Still Mind is All We Need | D. Samarender Reddy | 44 |
| 13. | An Offering at His Divine Feet | Sneha Choudhury | 46 |
| 12. | Arunachala's Gift | K. Lalitha | 47 |
| 14. | Taking Responsibility | | 49 |

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **S.V. Rajeswar, P.V. Lavanya Rao, K. Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# సంపాదకీయం

**వినుము, పురాతన జన్మం**

**బున( జేసిన యట్టి కర్మముల ఫలములు ప్రా**

**జ్ఞుని వైన బొందును వానికి**

**మనుజేశ్వర! మందు ధైర్యమహిమయు చుమ్మీ**

మహాభారతం, శాంతి పర్వం 4-14

భీష్ముడు ధర్మరాజుతో అంటాడు. దాని అర్థం.

రాజా! వినుము. పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితాలు మిగిలి ఉంటే, అవి తప్పక ఈ జన్మలో నరుడిని చేరుతాయి. ఈ కర్మ ఫలాల అనుభవం విషయంలో పామరుడైనా, పండితుడైనా ఒక్కటే. పండితుడికి మినహాయింపు లేదు. అయితే మరి, ఆ కర్మ ఫలితం అనుభవానికి నివారణౌషధమే లేదా! అంటావా! ఉంది గొప్ప ధీరత్వంతో వాటిని స్వీకరించటమే ఆ నివారణ మార్గం.

మళ్ళీ ఆయన శాంతి పర్వం, చతుర్థాశ్వాసములో, 30 శ్లోకంలో

**కామక్రోధాధ్యములగు**

**నీ మానస వికృతు లుడిపి యేకాంత గుహా**

**రాముడవై నిను వెదుకుట**

**సూమే లోండెల్ల నుడుగు సులభ వివేకా.**

నీవు అమృతార్థివైతే నీ మానస వికారాలయిన కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం - అనే దుర్గుణాలను విసర్జించుము. ఏకాంత ప్రదేశాన నిశ్చల మనస్కుడవై నిన్ను నీవు అన్వేషించు

కొమ్ము. అదే మేలు. ఇతర వ్యవహారములు అన్నింటినీ త్యజించుము.

ఇదే విషయాన్ని భగవాన్ శ్రీరమణ మహర్షి, తన శ్రీరమణ భాషణములు, 162వ పేజీలో ఒక భక్తుడు వేసిన ''ఆత్మ విచారమెందుకు'' అన్న ప్రశ్నకు సమాధానంగా అంటారు.

''ఆత్మ విచారం చేయకుంటే, లోక విచారం చోర బారుతుంది. లేని దానిని వెదకటంతో, స్ఫుటమైన దానిని వదులు కోవడమవుతుంది. ఆత్మ సిద్ధించగానే, విచారం గూడ ఆగిపోతుంది. నీవాత్మ నిష్ఠుడౌతావు. దేహమాత్మ యనుకొన్నంత కాలం, ఆత్మ నష్టమైందనీ, దానికై వెదకు తున్నామనుకోడమే గాని, నిజంగా ఆత్మనష్టం గాదు. అది ఎప్పుడూ ఉంది. దేహాన్ని ''ఆత్మయని, ఒక ఇంద్రియాన్ని ఆత్మయనీ, జీవాత్మయనీ, పరమాత్మయని, ఇట్లు వారు పేర్కొనే ఆత్మలు వందలూ వేలూ ఆ వెదకడం యదార్థమైన ఆత్మ కొఱకే గాని, అన్యులకు గాదు.

దీని వల్ల మనకు స్పష్టమయ్యేది ఏమిటి అంటే, కర్మ ఫలాలు అనుభవించక తప్పదని, ఈ జనన మరణాల పరంపర నుండి తప్పించు కోవడానికి ఆత్మ విచార మొక్కటే మార్గమని.

ఇది భగవాన్ శ్రీరమణ మహర్షులు అందించిన ముఖ్యమైన సందేశం. ఇదియే మనకు జన్మరాహిత్యానికి దారి తీసే మార్గం.

**- సీతంరాజు వెంకట రాజేశ్వర్**

## మనవి

రమణజ్యోతి పత్రికలో ప్రచురితమయ్యే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు కేవలం రచయితల సొంతవి మాత్రమే. పత్రిక యాజమాన్యం, సంపాదక వర్గాలకు వీటితో ఎలాంటి సంబంధం లేదు.

# నీ ధర్మాన్ని నీవు చక్కగా నిర్వర్తించు

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 39వ ప్రవచనం

తెలుగు అనువాదం: తాడిమేటి సత్యనారాయణ

చాలామంది తాము చేసే వృత్తిలో సంతృప్తి సంతోషాలుండవు. కాని జీవించియున్నంతకాలం ఏదో ఒక వృత్తి చేయక తప్పదు. ఏ పని చేయవలసి వచ్చినా, అది నచ్చినా, నచ్చక పోయినా, దానిని మన శక్తి కొలది భక్తిశ్రద్ధలతో నిర్వర్తించాలి. అది భగవంతుని సంకల్పమని భావించి ఆ వృత్తిని చేపట్టాలి. మన శక్తి మేరకు మనం చేయాలి అనే భావన ఉండాలి. ఆ పై చేసిన పని యొక్క ఫలితాన్ని భగవంతునికి వదలేయాలి. ఇట్లాగ చేయడం వల్ల మన మనస్సు పరిశుద్ధమవుతుంది. వృత్తిలో సడలుబాటు, కాని, తేలికగా తీసుకోవడం కాని, షరతులు కూడినట్టిదిగాని ఉండకూడదు.

మహాభారతంలో ఒక కథ ఇది. తపశ్శీలుడయిన కౌశికుడనే బ్రాహ్మణుడు ఒకనాడు ఒక చెట్టు క్రింద ఆసీనుడై తపస్సులో మునిగి ఉంటాడు. అపుడు చెట్టుపై వ్రాలి యున్న ఒక కొక్కెర అతనిపై రెట్ట వేసింది. కౌశికుడు మండిపడి ఎర్రని కళ్లతో ఆ కొక్కెరను చూశాడు. ఆయన చూపు ఆ కొక్కెర మీద పడగానే అది మాడి మసి అయి పోయింది. తనకింత శక్తి వుందా యని అతడు ఆశ్చర్యపోయాడు. ఒక తడవ తన శక్తి ఏమిటో, ఎటువంటిదో తెలిసిన తర్వాత అతనిలో అహంకారం ఎక్కువైపోయింది. ఆ పట్టణంలో భిక్షకై వీధి వీధి తిరుగుతూ చివరకు ఒక ఇంటి ముందు నిలబడ్డాడు. ''భవతీ బిక్షాందేహీ'' అని పిలుపు నిచ్చాడు. ఆ యింటి గృహస్థురాలు బయటకు రాలేదు. ఆమె పతివ్రత. ఆమె అత్తమామల సేవలో నిమగ్నమై వుంది. అదే ఆమె ధర్మమని భావించింది. కొంత సమయమయ్యాక బయటకు వచ్చి ఋషికి భిక్ష నొసగింది. ఋషి ఆగ్రహంతో ఊగిపోయాడు. ''భిక్ష

మివ్వటానికింత ఆలస్యమా?'' అని ఇంత సమయం అతనిని ఆమె వేచి ఉంచే లాగున చేసిందే యని ఆమె నిర్లక్ష్యానికి కుమిలి పోయాడు. కొక్కెరను చూసినట్లే ఆమెపై తన దృష్టిని సారించాడు ఆ ఋషి. కాని ఆమెను ఆ చూపులు ఏమీ చేయలేక పోయాయి. అతని ఆగ్రహాన్ని చూసి ఆమె ''ఓయీ నేను ఏమయినా కొక్కెరననుకొన్నవా నీ చూపులు పడి బూడిద అయిపోడానికి?'' అన్నది.

ఋషి ఆమె మాటలు విన్నాడు. ఆమె ఒక సాధారణ స్త్రీ కాదు అని భావించాడు. వెంటనే అతని గొంతు మారింది. ''అరణ్యంలో జరిగిన విషయం మీకు ఎట్లాగ తెలుసు?'' అని ప్రశ్నించాడు. ''నేను కొంత ఆలస్యంగా బిక్ష పెట్టినందుకు మీరు ఆగ్రహించారు. మీరు కొంత సమయం వేచి వుండవలసి వచ్చింది. నా అత్తమామలకు పరిచర్యలు చేయాలి. అది నా ధర్మం కాదా? మీరు ఋషులు, ఆగ్రహం చెంద కూడదు'' అని ఆయనతో పల్కింది ఆ పతివ్రత. కౌశికుడు ఇది విని ''అమ్మా! మీరు సాధారణ వ్యక్తి కాదు. ధర్మము అంటే ఏమిటో నాకు బోధించండి. నేనేమి చేయాలి?''అని ప్రాధేయపడ్డాడు.

''నేను మీకు బోధించలేను. ప్రక్కనే ఉన్న పట్టణంలో ధర్మ వ్యాధుడనే ఒకాయన ఉన్నాడు. ఆయనే మీకు ధర్మం బోధించగల వ్యక్తి'' అన్నది ఆమె.

కౌశికుడు ప్రక్క పట్టణానికి వెళ్లి ధర్మవ్యాధుని గురించి వివరాలు అడిగాడు. చివరకు అతని గృహాన్ని చేరుకొన్నాడు. ఆ యింటిని చూసి దిగ్భ్రాంతి చెందాడు. అదొక మాంస విక్రయ అంగడి. ధర్మవ్యాధుడు జంతు మాంసమును ముక్కలు చేసి అమ్ముతున్నాడు. అతడు ధర్మవ్యాధుడు అవునో కాదో అనే సంశయంతో తిరిగి నిర్ధారణ చేసుకొన్న తర్వాత కొంచం వెనుకాడుతూ ఆ కిరాతుని కలిసాడు.

కిరాతుడయిన ధర్మవ్యాధుడు కౌశికుని చూసి, ప్రక్కన నగరంలో

ఒక పతివ్రతా తిలకము కదా మిమ్ము ఇక్కడికి రమ్మని చెప్పినది? అన్నాడు.

కౌశికుడు మళ్లీ ఆశ్చర్యపోయాడు. ఇలాగ జరగడం రెండవ మారు. ''అవును ఆమె నన్ను ఇక్కడకు పంపారు. మీరు నాకు ధర్మం బోధించాలి'' అని కోరాడు.

''సరే బోధిస్తాను. కాని ఇప్పుడు కాదు. నా పని ముగించిన పిదప చెబుతాను'' అన్నాడు ధర్మవ్యాధుడు. ఈ మహాభారత కథ ఎంతో ఆసక్తి కరమయినది. ఒక కిరాతుడు ఋషికి ధర్మాన్ని బోధించడమా?

కౌశికా! కిరాతుడను నేను. అదే నా వృత్తి. ఇదే వంశపారంపర్యంగా వచ్చింది ఈ వృత్తి. నాకు అది తప్ప వేరే మార్గం లేదు. నా వృత్తిని నా శక్తి మేరకు ఏ లోపం లేకుండా చేస్తున్నాను. పలురకాలయిన వృత్తులను ఆచరించేవారుంటారు. ప్రతి యొక్కరు వారి వృత్తులను నిర్వర్తించాలి. నేను నా వృత్తితోపాటు, నా తలిదండ్రులను, సంసారాన్ని పోషించాలి. వారికి సేవ ఏయాలి. ఏది ఏమయినా వారి వారి పనులు చేసుకోవలసిందే. చేసిన కర్మఫలాన్ని ఈశ్వరునికి అర్పించాలి. ఇది కావాలి, అది కావాలి అని ఆశించకూడదు. ఇది చేస్తాము, అది చేస్తాము అనవద్దు. నీకు ఇచ్చిన పనిని నీ శక్తి మేరకు నిర్వర్తించు అని ధర్మవ్యాధుడు బోధించాడు కౌశికునితో.

ఒకమారు ఒకరు శ్రీరామకృష్ణ పరమహంస దగ్గరకొచ్చి ''నాకు వ్యాపారం చేయడం ఇష్టం లేదు'' అన్నారు.

''ఆ వ్యాపారం మంచిది కాదని నీ కెట్లా తెలుసు?'' అని ప్రశ్నించారు శ్రీరామకృష్ణ అతనిని.

''కర్మ చేయువలసిందే. వ్యాపారం లేకుండా ఈ ప్రపంచం ఉండగలదా? వినియోగదారులు నీ దగ్గరకు వస్తున్నారంటే మళ్లీ వాళ్ళు సంతృప్తి చెంది తిరిగి వెళ్లాలి కదా! వ్యాపారులు లాభాలు గడించక

పోతే జీవించలేరు కదా! కాని వినియోగదారులను దోచుకోకూడదు. వినియోగదారులు సంతృప్తికరంగా వుంటే మీ కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించినట్లే. కారణం వారందరూ మీ అతిథులే. ఎందరినో కాదని మీ అంగడికే ఎందుకు రావాలి? అట్టి వైఖరిని మీరు కలిగి యుండాలి. దానికి భగవంతుని అనుగ్రహం కావాలి'' అని పలికారు శ్రీరామకృష్ణ.

ఎవరు ఎట్టి పదవిలో వున్నా ఆ పదవి యొక్క ఔన్నత్యాన్ని నిలబెట్టాలి. ఆ పదవి నిర్ధారించే కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలి. పెద్ద పదవులు ఊరికే వస్తాయా? బాధ్యతతో కూడిన పదవిని ఆ భగవంతుడే ఇచ్చాడనే నమ్మకం ఉండాలి. బాధ్యతలను ప్రజోపకారానికై శక్తిమేరకు నిర్వర్తించాలి.

శ్రీ భక్తి వేదాంత ప్రభుపాద గురించి అందరూ వినే ఉంటారు. ఆయన అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంస్థాపకాచార్యులు. ఆ సంస్థను 1969లో ప్రారంభించారు. ప్రపంచంలో అది చాలా శక్తిమంతమయిన ఆధ్యాత్మిక సంస్థగా రూపొందింది. ఎందరో సంపన్నులు సర్వం త్యాగం చేసి ఆ సంస్థలో చేరారు. ఫోర్డు మోటారు కంపెనీ వ్యవస్థాపకుని కుమార్తె సర్వమూ త్యజించి అందు చేరింది. 35 సంవత్సరాల వయస్సు గల ఆమె ఆ సంస్థలో చేరింది. అమెరికాలో ఆ సంస్థ ఎదిగిన తీరు అందరినీ ఆశ్చర్యంలో ముంచుతుంది. అంత ఎత్తుకు ఎదిగిందంటే ఎవ్వరూ నమ్మలేరు. అంతటి ప్రజాదరణ పొందిన సంస్థ అది. అమెరికా దేశపు వాతావరణం గురించి అందరికీ తెలిసిందే. శీతాకాలం కురిసే మంచులో కృష్ణచైతన్య భక్తులు భారతీయ దుస్తులు ధరించేవారు. ఉదయం నాలుగు గంటలకే మేల్కొని పాలు పితికేవారు. గోవులను పూజించేవారు. అంతేనా? శుద్ధమయిన శాఖాహార భోజనం తినేవారు. ఈ భోజనం ఎవరిచ్చారు?

ప్రభుపాద ఒక మందుల కంపెనీ ప్రతినిధి. 50 సంవత్సరముల వయసు వచ్చింది. జీవితంపై విరక్తి కలిగింది. భగవాన్ శ్రీకృష్ణుని

స్మరించడానికి పూనుకొన్నారు. భాగవతాన్ని ఆంగ్లభాషలో అనువదించారు. కొందరి వ్యాపారవేత్తల ఆర్థిక సహాయంతో గ్రంథాన్ని ముద్రించి ప్రచురించారు. ఇంటింటికి వెళ్లి ఆ గ్రంథాన్ని అమ్మేవారు. అప్పటికి ఆయనకు 60వ సంవత్సరాల వయసు. ఇక భగవాన్ శ్రీకృష్ణుని బోధలను ఇతర దేశాలలో వ్యాప్తి చేయాలనే వాంఛ పెరిగింది ఆయనలో. ఆయన నిజాయితీని, భక్తిని అర్థం చేసుకొన్న కొందరు వ్యాపారవేత్తలు తప్ప, భారత దేశంలో వారెవరో తెలియదు. తాను అమెరికా వెళ్లడానికి సహాయం చేయమని మరొక వ్యాపారవేత్తను అర్థించారు. ''ఈ 60 సంవత్సరాల వయసులో నీవు ఏమి చేయగలవు? ఏమి సాధించగలవు?'' అని ప్రశ్నించారు. దానికి ''నాకు ఏమీ చేయాలని లేదు. కాని భగవంతుడే నన్ను ప్రోత్సహిస్తున్నాడు. ఒత్తిడి చేస్తున్నాడు. ఏదో చేయమని విదేశాలకి వెళ్లమంటున్నాడు భగవంతుడు. ఆ కారణం చేతనే విదేశాలకు పోదలిచాను'' అని సమాధాన మిచ్చారు శ్రీ ప్రభుపాద. ఎట్లాగో ఆ వ్యాపారవేత్త ప్రభుపాదను రవాణా నౌకలో ఎక్కించారు. అందు ప్రయాణమంటే ఖర్చు తక్కువ. ప్రయాణం మధ్యలో నడిసముద్రం దాటాక ప్రభుపాదకు గుండె నొప్పి వచ్చింది. ''నేను భగవంతుని కార్యమై బయలుదేరి పయనిస్తున్నాను. అంతా బాగానే వుంటుంది'' అని మనస్సును దిటవు చేసుకొన్నారు.

అమెరికా దేశంలో అడుగుపెట్టి పని వెంటనే ప్రారంభించారు. వారి భాగవత ప్రవచనం కొద్దిమంది అమెరికావాసుల సమక్షంలో జరిగింది. శ్రీకృష్ణుని గురించి ప్రబోధించారు. ఆయన ఇతరులను ఆకట్టుకొనేటువంటి వక్త కాదు. అయినా ఏదో తెలియని ఆవేశం ఆయనను ఆవరించింది. భావోద్వేగంతో శ్రీకృష్ణుని గురించి మాట్లాడారు. భక్తి పరవశంతో కన్నీరు కార్చారు. అది ఆయన ఘనతా? కాదు. ఎందరో వారి భాషణలను విన్నారు. ప్రభావితులయ్యారు. అయిదేళ్లల్లో ఒక గొప్ప భక్తి ఉద్యమం తయారయింది. అది సాధ్యమని

ఎవరూ నమ్మలేరు. ఎవరైనా అమెరికా వెళ్లి భక్తి పరవశంతో నాట్యము చేయగలరా? అక్కడ గోశాలను ఏర్పాటు చేయగలరా? ప్రాతఃకాలము నాలుగు గంటలకే మేల్కొనమని అక్కడి భక్తులకు చెప్ప గలమా? ప్రతి నగరంలో ప్రభుపాద శ్రీకృష్ణ చైతన్య సంస్థ శాఖలను స్థాపించారు. అక్కడి భక్తులందరూ హిందూ జీవనాన్ని అవలంబించారు.

దీనికంతా బాధ్యులెవరు? శ్రీకృష్ణ చైతన్య సంస్థను ప్రారంభించిం దెవరు? స్థాపించిన ఆ ప్రభుపాద స్థాపించిన పన్నెండు సంవత్సరాల తర్వాత శ్రీకృష్ణ పరమాత్మునిలో ఐక్యమయ్యారు. ఒకసారి ఊహించు కొంటే, అది మన దేశం కాదు, మన సంస్కృతి కాదు. బృందావనంలో భక్తులెట్లాగ జీవించారో అదే జీవనాన్ని ఇక్కడ కూడా జీవించారు. అరటి ఆకు విస్తరిలో భోజనం చేసేవారు. ఆయన భుజించిన అనంతరం అక్కడి అమెరికన్ భక్తులు వారి విస్తరిలోని ఉచ్ఛిష్టాన్ని ప్రసాదంగా స్వీకరించి భుజించటానికి ఎగబడేవారు. ఇది ఊహకందనిది. భగవాన్ శ్రీకృష్ణుని భక్తుల గురించి ఎంతో ప్రచారం చేశారు. అది శ్రీ ప్రభుపాద చేయగలిగారు. భగవంతుడే ఆయనలో ఉండి చేయించారు. అట్లాగ పుట్టిందే ఆ సంస్థ, ఆ ఉద్యమం. మరో కోణం నుండి ఆలోచించ లేము. శ్రీరామకృష్ణ పరమహంస ఒక అపూర్వమైన వ్యక్తి. రామకృష్ణ మఠంలో ఏం జరుగుతున్నదో దానిని విమర్శించకూడదు. శ్రీరామకృష్ణు లను విమర్శించుట తగదు. శంకరులను, శ్రీరమణులను విమర్శిం చుట తగదు. ఒక సంస్థ అంటే అందున్న వారికి ఒక బాధ్యత, ఒక బరువు, మనం అచటికి వెళ్లి, ఏదో చూసి, దానిని ఉద్ధరిస్తామని చెప్పడం చాలా హాస్యాస్పదం. మనం ఆశ్రమాలకు వెళ్లడం కేవలం శాంతి కొరకే. అంతే గాని విమర్శించి మనమేదో చేయకల్గుతామని కాదు. రమణ మహర్షి దర్శనానికి వచ్చే వారందరూ ఫలములను సమర్పించేవారు. పోను పోను అవి ఎక్కువై భోజన సమయంలో వాటిని అందరికి పెట్టేవారు. ఇచ్చిన ఫలములు సక్రమంగా వినియోగించారా లేదా యని

ఆరా తీయకూడదు. భగవాన్, ఒకసారి భక్తులు సమర్పించిన క్షణమే వారి పని పూర్తి అయినట్లే. మిగతాది ఆశ్రమం వారు చూసుకొంటారు. ఇది మన సంస్కృతి. దేవాలయానికి వెళ్లి పూజార్చనలు చేయిస్తాము. పుష్పములు, ఫలములు ఇస్తాము. పూజానంతరము కొన్ని పుష్పములు, ఫలములు తిరిగి మనకు ఇస్తారు. ఇతర భక్తులకు కూడా ప్రసాదముగా పంచుతారు. ఇట్లాగ మనకు ఇచ్చినదే ప్రసాద మంటాము. ఆ ప్రసాదాన్ని ఎంతో భక్తితో స్వీకరిస్తాము. ప్రసాదము అంటే సంతోషము, సంతృప్తి. భక్తి వేదాంత ప్రభుపాద ఎట్లాగ భగవంతునిచే ఆ పనికి ఎన్నుకోబడ్డారు?

ఇంగ్లండు నుండి ఒక ప్రొఫెసర్ వచ్చారు. ఆయన లక్నో విశ్వ విద్యాలయంలో ఉద్యోగం చేశారు. రోనాల్డ్ నాక్స్ ఆయన పేరు. ఆయనకు ఒకనాడు శ్రీకృష్ణ భగవానునిపై ప్రేమాభిమానాలు కల్గినాయి. భజనలలో పాల్గొనేవారు. సన్యాసం తీసుకొన్నారు. కృష్ణ ప్రేమ్ అని పేరు మార్చుకొన్నారు. కృష్ణ భజనలు పాడుకొంటూ ప్రదేశాలు తిరుగు తూండేవారు. ఇది భారతదేశపు స్వాతంత్ర్యానికి ముందు జరిగింది. ఆంగ్లేయులకు అతనిపై ద్వేషం కల్గింది. "నీవు ఆంగ్లేయుల సంస్కృతికే మచ్చ తెచ్చినావు" అని నిందించారు ఆంగ్లేయులు. భారతదేశపు ఆచార వ్యవహారాలను పాటించేవారు. ఆయనది పసివాని అమాయకత్వం వంటిది.

ఒకమారు శ్రీ భగవాన్ రమణుల దర్శనార్థం వచ్చారు. వారు, శ్రీ దిలీప్ కుమార్ రాయ్ మంచి మిత్రులు. కృష్ణ ప్రేమ్ మహర్షి ముందు ఆసీనులయ్యారు. ఎంతో మంత్రముగ్ధులయ్యారు. అపారమయిన శాంతిని భగవాన్ సన్నిధిలో అనుభవించారు. ఆ శాంతితో బాటు ఆయనలో ఒక ప్రశ్న ఉదయించింది. ఏమా ప్రశ్న? "నీవెవరవు?" అనే ప్రశ్న వదలక ఆయనను వెంటాడుతూండేది. ఆశ్చర్యపడ్డాడు. "నేనెవరు ఏమిటి?" నేను కృష్ణ ప్రేమ్‌ని. ఆ ప్రశ్న తాకిడికి తట్టుకోలేక

పోయారు. వెంటనే హాలు వదలి బయటకు వెళ్ళిపోయారు. తనలో తాను ఇట్లాగ అనుకొన్నారు. ''నేను శాంతి కొరకు ఇక్కడికి వచ్చాను. బదులుగా వీరు నన్ను ప్రశ్నలతో వేధిస్తున్నారు'' అని వాపోయారు కృష్ణ ప్రేమ్. మర్నాడు తిరిగి హాలులోనికి ప్రవేశించారు. ''ఇదా మీరు చేస్తున్నది?'' అని భగవాన్‌ను ప్రశ్నించి కళ్ళు తెరిచారు. భగవాన్ వైపు చూసి మళ్ళీ కళ్ళు మూసుకొని ''నీవెవరవు?'' అని ప్రశ్నించారు తనలోనే. కొంత సమయమనంతరము కళ్ళు తెరచి చూడగా, భగవాన్ అదృశ్య మయ్యారు. అదొక వింత అనుభవము. ఆ అనుభవాన్ని శ్రీ దిలీప్ కుమార్ రాయ్‌తో పంచుకొన్నారు. అదొక మాయ అని భావించారు. కొన్ని మార్లు కళ్ళు మూసుకోవటం, కళ్ళు తెరవటం చేశారు. ఈ తడవ చూస్తే భగవాన్ సోఫాపై కూర్చొని ఉండటాన్ని చూశారు. తన ఆరాధ్య దేవత శ్రీకృష్ణుల దర్శనం కొరకు వాంఛించారు. వెంటనే శ్రీ భగవాన్ బదులు శ్రీకృష్ణుల దర్శనం కల్గింది. ఎటువంటి హడావిడి, ఆర్భాటం లేకుండా నిశ్శబ్దంగా ఈ అనుభవాన్నిచ్చారు కృష్ణప్రేమ్‌కి శ్రీ భగవాన్ రమణ. కృష్ణ ప్రేమ్ (రోనాల్డ్ నాక్స్) అడగకనే ఈ అనుభవాన్ని అనుగ్రహించారు. అది కూడా అనుకోకుండా జరిగిన అనుభవము.

ఇంతకీ కృష్ణప్రేమ్ ఏమని ప్రశ్నించారు? ''నీవెవరవు?'' అని ప్రశ్నించారంతే. అంతే శ్రీరమణ ఒక అపురూపమైన అనుభవాన్ని అనుగ్రహించారు. మరొక కారణం అప్పటికే కృష్ణ ప్రేమ్ ఒక పరిపక్వత చెందిన భక్తుడు. కృష్ణ ప్రేమ్ కొన్ని సంవత్సరాలు జీవించి చివరకు అల్మోరా లో శరీరాన్ని వదిలారు.

మనకు తెలియదు ఎప్పుడు మన మీద ఆ అనుగ్రహం కురిపిస్తారో యని. ఎవరిని ఎన్నుకొని వారికి అనుగ్రహవర్షం కురిపిస్తారో ఎవరు ఎరుగ గలరు? ఈ విధంగా జరగాలని మనం ఎదురు చూస్తాము. కాని అట్లాగ జరుగదు. మనకి తెలియకుండా, అనుకోని ఒక సమయం, ఊహించని ఒక క్షణం అది మనకు కల్సి వస్తుంది. కనుక అర్హత

లేదని కాని, ఒకరు అనర్హుడు అని చెప్పడానికి మనం ఎవ్వరు? ఎవరు అర్హులో మనం చెప్పలేము. మనం మన సాధనామార్గంలో ముందుకు పోవటం లేదని విచారించవలసిన అవసరం లేదు. "నీ ఆధ్యాత్మిక పురోగతిని గురించి నీవు చింతించకు. అది సూర్యోదయం వంటిది. అంధకారంగా ఉన్న సమయం తటాలున వెలుతురు జనిస్తుంది. సూర్యోదయం వలె అగుపిస్తుంది. ఎందరో యోగులు, ఋషుల చరిత్రలే మనకు తార్కాణము. ఒకని మనస్సు అజ్ఞానాంధకార మయమైనా సరే, భగవాన్ అనుగ్రహిస్తే చాలు, జ్ఞానమనే క్రొవ్వొత్తిని చూపితే చాలు అంధకారం మాయమవుతుంది. ఇది మనకు కావాలను కొన్నప్పుడు జరుగదు. అది రమణుల సంకల్ప ప్రకారమే జరుగుతుంది. మనం నమ్మకం విశ్వాసంతో వేచివుండవలసిందే. మనం ప్రభుపాద, రోనాల్డ్‌నాక్స్ జీవితాలను గమనిస్తే ఇదే మనం గ్రహించ గల్గుతాము.

అట్లాగే శ్రీ అరవింద్ ఘోష్ - అప్పుడు వారు పదేళ్ల వయసు బాలుడు. అతనికి ఏ భాషా రాదు. మాతృభాష అయిన బెంగాలీ కూడా సరిగ్గా రాదు. అరవిందుల తండ్రి చాలా ఖచ్చితమైన మనిషి. చాలా కఠినంగా ఉండేవారు. బెంగాలీ భాష మాట్లాడకూడదనే వారు ఆయన. అరవిందులకు ఇంగ్లీషు బోధించమని ఒక ఆంగ్ల బోధకుని నియమించారు. అతనిని ఆంగ్లేయ పద్ధతిలో పెంచమని చెప్పారు. అరవిందులను ఇంగ్లండు పంపించారు. వారు తమ 21వ ఏట భారత దేశానికి తిరిగి వచ్చారు. మాతృభూమిపై కాలిడగానే ఏదో తెలియని స్వేచ్ఛను అనుభవించారు. అట్టి అనుభవము మరెక్కడా లభించలేదు. ఈ భరతభూమిలో ఒక అద్భుతశక్తి ఒకటి ఏదో ఉందని మాత్రం గ్రహించారు. సంస్కృతం, బెంగాలి నేర్చుకొన్నారు. తదనంతరం ఒక విప్లవకారుడయ్యారు. వారిని అలాపూర్ కారాగారంలో బంధించారు. ఒకమారు అలాపూర్ కారాగారంలో ఇద్దరు వ్యక్తులను కలిసారు. అదే

ఆయన జీవితంలో తీసుకొచ్చిన ఒక మలుపు. ఒక ఆధ్యాత్మిక జీవితానికి నాంది పలికింది ఆ మలుపు.

"నేను ఎందుకు ఉన్నాను ఇక్కడ? ఈ దేశాన్ని ఈ సంకెళ్ల నుండి విడిపించాలి. కాని నా వల్ల కాదు. కారణం ఈ కారాగారంలో బంధింప బడ్డాను" అని వాపోయారు. ఇనుప కటకటాల గుండా బయటికి తొంగి చూశారు. కటకటాలు కనబడలేదు. బదులుగా భగవాన్ శ్రీకృష్ణుల వారు దర్శనమిచ్చారు. జైలు వార్డెన్ కనబడలేదు. కాని కృష్ణులే కనబడ్డారు. అన్నిటి యందు కృష్ణుడే కనిపించారు. కృష్ణునినే చూశారు. సర్వం కృష్ణం జగత్. ఆ క్షణం అరవిందుల వారికి ఇట్లాగ మనస్సులో మెదలింది.

"భగవాన్ శ్రీకృష్ణ నాకిచ్చిన సందేశమిదే. నా దేశపు స్వాతంత్ర్యం కాదు నాకు ఆదేశించింది. ఈ దేశపు ప్రజలకు మోక్షాన్ని కల్గించాలి. అందులకే శ్రీకృష్ణులు నాకు దర్శనమిచ్చారు."

వారిలో ఒక దృఢమయిన నమ్మకం కల్గింది. కొన్ని నెలల్లో వారు పాండిచ్చేరి (ఇప్పుడు పుదుచ్చేరి) చేరారు. అక్కడితో ఒక అధ్యాయం ముగిసింది. ఎవరూ వారిని చూడలేదు. భగవంతుడు ఆయనకు మరొక అధ్యాయాన్ని ప్రారంభించారు. మరొక ధ్యేయాన్ని కలుగ జేశారు. ఏవో కొన్ని ముఖ్యమైన దినములలోనే వారు ప్రజలకు కనబడేవారు.

కనుక భగవంతుడు ఎవరిని ఎట్లాగ ఎన్నుకొంటాడో మనకు తెలియదు.

"నీ ధర్మాన్ని నీవు చక్కగా నిర్వర్తించు. వేచి యుండు. నిన్ను ఎట్లాగ ఉపయోగించుకోవాలో ఈశ్వరునికి తెలుసు. అంతేగాని నీవు ఇష్టపడినట్లు గాని, నీవు కావాలనుకొన్నట్లు కాదు." అని భగవాన్ అనేవారు.

శ్రీ వివేకానందులకు పాశ్చాత్యదేశాలకు వెళ్లాలనే కోరిక ఉండేది కాదు. కొంతమంది ధన సహాయం చేసినా నిరాకరించారు. విదేశాలకు

వెళ్లాలని తనకు భగవంతుని నుండి పిలుపురాలేదన్నారు. కొన్నేళ్ల తర్వాత ఒకనాడు మెద్రాసులో (ఇప్పుడు చెన్నై) తన మంచంపై పడుకొని ఉన్నారు. ఆయనకు ఒక కల వచ్చింది. ఆ కలలో శ్రీరామకృష్ణ పరమహంస సముద్రంపై నడుస్తూ తనని పిలవడం కలలో చూశారు. ఆ కలే తనకు పిలుపు అయిందని ఇక తన గురువుల బోధలను ప్రపంచం అంతటా వ్యాప్తి చేయాలని అన్నారు. వాస్తవానికి వారికి విదేశాలకు వెళ్లాలనే వాంఛ లేదు. మాట్లాడాలనే కోరిక లేదు. ఎప్పుడూ మౌనంలో ఉండటానికే ఇష్టపడేవారు. తమ గురువులయిన శ్రీరామకృష్ణ పరమహంసతో.

"నాకు ప్రవచనాలు చేయడం ఇష్టం లేదు. మౌనం అంటేనే ఇష్టం. మీరు నాకు అనుభవాన్నిచ్చారుకదా!" అని అన్నారు. బదులుగా శ్రీరామ కృష్ణులు ఇలా అన్నారు. "తాళం చెవులు నా చేతులో ఉన్నాయి. నీ పని వేరు. నీవు చేయవలసింది చాలా ఉంది. ఒకసారి పని పూర్తి అయిన తర్వాత వెంటనే ఈ లోకం నుండి నిష్క్రమిస్తావు". శ్రీ వివేకా నందులు గురువాక్య పరిపాలన చేశారు. కనుక మనం కోరడం, ఆశించడం కాదు. ఏ పని చేయాలో, ఏది చేయకూడదో అంతా ఆ చైతన్య శక్తి నిర్ణయిస్తుంది.

అరుణాచల శివ! అరుణాచల శివ! అరుణాచల శివ!

సూచిక: కౌశికుడు, ధర్మవ్యాధుడు, వీరి కథ మహాభారతంలో అరణ్య పర్వములో ఉంది. వివరముల కొరకు అరణ్యపర్వాన్ని సంప్రదించండి.

రచయిత హైదరాబాదు రమణకేంద్రంలో భక్తులు

- **ఒకడు ఇతరులకు ఇచ్చేవన్నీ నిజానికి ఇచ్చుకునేది తనకే. ఈ సత్యం తెలిస్తే ఈయని వారెవరు? - నేనెవడను?**

# మండనమిశ్రునితో సమావేశం

ఆంగ్ల మూలం: మాడుగుల ఇందుశేఖర శాస్త్రి

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: పింగళి సూర్యసుందరం

విశ్వరూపుని వివాహవార్తతో బాటు పండితునిగా అతని ఖ్యాతి బాగా వ్యాపించింది. ప్రగాఢమైన అతని విద్వత్తును అందరూ గౌరవించే వారు. ఆ ప్రాంతాలలో అతనిని పేరు పెట్టి ఎవ్వరూ పిలిచేవారు కారు, విద్వాంసులలో శ్రేష్ఠుడనీ, మండనమిశ్రుడనీ అనేవారు. భారతి ప్రత్యేకత అత్తవారింట్లో అందరికీ తెలిసింది. అటు పుట్టినింటా, ఇటు మెట్టినింటా కూడా విదుషీమణి అని అదరూ అంగీకరించటం వల్ల, ఆమెని 'ఉభయభారతి' అనేవారు.

కుమారిలుని అంతిమ సూచననుసరించి ఆచార్యులవారు మాహిష్మతికి వెళ్లి, మండనమిశ్రుని అద్వైతమార్గానికి మళ్లించటానికి ఉద్యుక్తులయినారు. ప్రయాగనుండి నర్మద చేరటానికి మాకు కాలినడకన ఒక మాసం పట్టింది. ఆ నగరం నర్మదకు ఉత్తరదరిని ఉంది. ఉదయసంధ్యానుష్టానం ముగించుకొని ఆచార్యులు నదీతీరాన, నదిపై నుండి వచ్చే చల్లని గాలులు వీవగా విశ్రమించారు. మధ్యాహ్నానికి ముందుగానే నగరం ప్రవేశించి చెంతనే బావి నుండి నీరు తీసుకొంటున్న కొందరు స్త్రీలను మండనమిశ్రుని గృహానికి దారి చెప్పమని అడిగాము. వారికి ఆ ఇల్లు సుపరిచతమే. వాళ్లు, ఊరిమధ్యలో ఉన్న అతిపెద్ద భవనానికి వెళ్లమన్నారు. ఇంకొక గుర్తు కూడా చెప్పారు. ఆ ఇంటి ముఖద్వారం వద్ద అనేక రామచిలుకలు, ''వేదాలు స్వయంభువాలా? తాత్త్వికచింతనకన్నా కర్మాచరణ ఉత్తమమా? ఈ విశ్వం నిత్యమా లేక కాల్పనికమా'', ఇత్యాది తాత్త్విక చర్చలు జరుపుతూంటాయని.

ఈ వివరణకి మేము ఆశ్చర్యపోయాం. ఈ మండన మిశ్రుడెంతటి వాడో అనుకుంటూనే - ఆ భవంతిని చేరుకొన్నాం. ఆ భవంతి చుట్టూ కొన్ని ఇళ్లూ, పెద్ద పెద్ద గదులూ ఉన్నాయి. ఆ తోటలూ, భవనాలూ సూర్యకాంతిలో మిరుమిట్లు గొల్పాయి. ఆ గృహస్థు సంపదనీ, ఆయన వాటిని పరిరక్షించుకొనే తీరునీ తెల్పాయి.

ఆ ఇంటి ముఖద్వారం తాళం వేసివుంది. మమ్మల్ని చెంతనున్న చెట్టు నీడలో ఆగమని ఆచార్యుల వారు భవంతి వెనుకవైపుకు వెళ్లారు. గోడనానుకొని ఉన్న వేపచెట్టు పుణ్యమా అని పదహారేళ్ల ఆచార్యులు, మండనమిశ్రుడు పితృదేవతలకు శ్రాద్ధం జరుపుతున్న ప్రదేశాన్ని చేరగలిగారు. శ్రాద్ధకర్మ ప్రారంభించే ముందు తన తపోబలంతో వ్యాసుని, జైమినిని ఆవాహనం చేసి వారి పాదాలను భక్తితో కడుగుతున్నాడు మండనమిశ్రుడు. అప్పుడు ఆ ఋషులిద్దరూ ఆచార్యుని చూచి చిరునవ్వు నవ్వారు. సవినయంగా ఆచార్యులు వారిద్దరికీ వందనమాచరించారు. కాని తాను క్రతువు జరుపుతున్న వేళ ఒక పిన్న వయస్కుడైన సన్న్యాసి రావటం చూచి ఆశ్చర్యపోయాడు మండన మిశ్రుడు. అటువంటి వేళ, సన్న్యాసిని చూడటం అశుభం. అందువల్లనే వాకిలి తలుపును మూయించాడతను. ఈ సన్న్యాసి దొంగచాటు రాక మరీ అపచారం. తన కార్యక్రమానికి కలిగిన అంతరాయానికి చకితుడై కోపంగా ఆ బాలుడెచ్చటనుండి వచ్చాడో తెలిసికో గోరాడు "కుతో ముండి? నీ వెక్కడనుంచి వచ్చావు?" ఈ ప్రశ్ననే ఇంకొక విధంగా అన్వయించుకొంటే "నీ వెంతవరకు ముండనం చేయించుకొన్నావు" అవుతుంది.

పరిస్థితి తన కైవశమయిందని గ్రహించారు ఆచార్యులు: మండనునిపై ఇంక లంఘించాలనుకున్నారు. వాగ్వివాదానికి దింపాలనుకున్నారు. కర్మకాండకు సంబంధించిన తత్త్వాన్నే మండనుడు

అవలంబిస్తాడు - కాని ఆచార్యుల వారి అనుభవం దృష్ట్యా అది సమర్థనీయం కాదు. కావాలనే, ఆచార్యులు అతనినీ పురిగొల్పారు. పండితునిగా మండనుని తాము ఎంతగా గౌరవించినా, కొంత ఆటపట్టిద్దామనుకున్నారు.

"మీకు కనబడుతూనే ఉంది కదా - మెడపై భాగాన్నంతా ముండనం చేయించుకొన్నాను".

"నేనడిగేది దాని సంగతికాదు - నీవు ఆదరించే మతమేమిటి? నీవే మార్గాన్ని అవలంబిస్తున్నావు? పంథాస్తే పృచ్ఛతేమయా" మళ్ళీ ఆ ప్రశ్నలోని ద్వంద్వార్థాన్ని తీసికొని ఆచార్యులు అడిగారు.

ఈ బాలుని వద్దనుంచి సూటియైన సమాధానం పొందటం కష్టమని మండనుడు గ్రహించి "నీవొక విధవకుమారుడవని చెప్పింది" అన్నాడు. "నీవొక విధవ కుమారుడవని చెప్పిందా. నిజమేనేమో, పాపం! ఇది వినటానికి ఎంతో విచారంగా ఉన్నది నాకు."

మండనునికి విసుగు ఎక్కువౌతున్నకొద్దీ - ఆచార్యునకు సరదా ఎక్కువౌతోంది.

'బాలకా! నీవు తాగి ఉన్నావా - పీతాకిము సురా?" మళ్ళీ ద్వంద్వార్థాన్ని ఆసరాగా తీసుకొని, ఆచార్యులు "కల్లు పచ్చగా ఉంటుదా అనా మీరడిగేది - కాదు, తెల్లగా ఉంటుంది".

"అయితే కల్లు రంగు కూడ తెలుసునన్నమాట నీకు"

"కాని మీ కయితే దాని రుచి కూడా తెలుసు" మండనునికి కోపం రెచ్చిపోయి "నీ పిచ్చి ప్రేలాపనకి కారణం నీవు కుళ్ళిపోయిన మాంసం తినటమా, మత్తోజాతః కలం జాశీ" అని అడిగాడు.

ఈ వాక్యంలోని విపరీతార్థం: "నాకు పుట్టిన నీవు, చెడిన మాంసం

తిన్నావా'' అని. దీనిని తీసుకొని ఆచార్యులన్నారు ''తండ్రి ఎట్లాగో తనయుడూ అట్లే'' అన్నారు.

ఇంకొక వైపు నుండి మార్కొందామని మండనుడు ''సరేగాని, నాకు ఒక చిత్రం కనబడుతోంది. మెడలో జంధ్యాన్నీ, తలమీద పిలకనీ తీసివేశావు - అవి బరువైపోయాయా నీకు? అయినా, నీ భుజం మీద చాలా బట్టలున్నాయే గాడిద బరువులాగ'' సన్న్యాసాశ్రమం తీసుకొన్న వారికీ, గృహస్థులకూ గల తేడా గురించి ఈ ప్రస్తావన.

''నిజమే. మీ తండ్రిగారు భార్యని భరించారు కదా - అంత కంటే ఇదే నయం. దానికి ఫలితం కనబడుతూనే ఉంది. ఈ చిన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. ఇక బ్రహ్మవిద్యను తెలుసుకోవటం మీ వల్లనేమౌతుంది?''

''నా కన్నీ తెలుసు. చింపిరి బట్టలు కట్టుకొని, కొందరిని వెనుక వేసుకొని అన్నానికై బిచ్చమెత్తుకోవటమే సన్యాసమంటే, సోమరితనానికి అదొక సాకు''.

''అట్లా అయితే, గార్హస్థ్యమంటే ఏమిటో? బ్రహ్మచర్యాన్ని పాటించ లేక, తన కామాన్ని అదుపులో పెట్టుకోలేక ఒక స్త్రీని చేర్చి కామవశుడై ఉండటమే కదా?''

''స్త్రీలను అట్లా నిందించటం అపరాధం. నీకు జన్మనిచ్చి, నిన్ను పెంచి పెద్ద చేసింది ఒక స్త్రీయే అని మరచిపోకు. అంత కృతఘ్నత పనికిరాదు''.

''అయితే స్త్రీ గర్భం నుంచే పుట్టి ఆమె స్తన్యాన్ని తాగినా - జంతువు వలె స్త్రీ పక్కలో పడుకుందామని ఎట్లా అనిపిస్తోంది.''

మండనుడు ఇంకొక విషయాన్ని లేవనెత్తుతూ ''శాస్త్రాలు నిర్దేశించిన అగ్నిహోత్రాన్ని నిర్లక్ష్యం చేయటం పితృహత్యతో సమానం'' అన్నాడు.

"తానే బ్రహ్మమని బోధించే ఆత్మవిద్యని నిర్లక్ష్యం చేయటం ఆత్మహత్యతో సమానం."

"నువ్వు దొంగవి - నా యింట్లోకి దొంగచాటుగా ప్రవేశించావు."

"అసలు దొంగలు మీరే. శాస్త్ర ప్రకారం సన్న్యాసులకు ఆహారం ఇవ్వటం లేదు మీరు. వారికి ఆహార కొరత కలిగిస్తున్నారు".

ఏమితోచక, మండనుడు "నీ వంటి మూర్ఖునితో మాట్లాడుతూ నా క్రతువుకు అంతరాయం కల్పించుకొన్నాను. అయినా, ఈ అంధకార యుగంలో నిజమైన సన్న్యాసులూ, యోగులూ ఎక్కడున్నారని? నీ వంటివారు సమాజానికి చీడపురుగులు."

"ఈ రోజులలో, పవిత్రాగ్నిహోత్రాలు ఎక్కడున్నాయి? కర్మకాండ వల్ల స్వర్గసుఖాలను సాధించిన ఆ మహనీయులెక్కడ ఉన్నారు ఇప్పుడు? స్త్రీ పొందును కోరాలనే కాంక్షను కప్పిపుచ్చుకోవటానికి మీ వంటివారు ఈ క్రతువులను చేస్తూంటారు."

ఆ మహనీయులిద్దరూ ఒకరినొకరు ఇట్లా అవమానించుకొంటూనే ఉన్నారు. కాని ఇద్దరిలో ఒక తేడా ఉంది. ఇద్దరిలోకి పెద్దవాడయిన మండనుడు కోపిష్ఠి, గర్విష్ఠి. ఆచార్యులు మాత్రం చమత్కారంగా ప్రత్యుత్తర మీయటానికే పరిమితమయ్యారు. ఆయనకు సంతోషాన్ని కలిగించింది ఇది.

ఆ సమయంలో వ్యాసులవారు జోక్యం చేసుకొని అభ్యాగతుడైన సన్న్యాసిని అవమానిస్తున్న మండనుని మందలించారు.

ఏమయినా సరే, భోజనం వేళ వచ్చిన అతిథిని, విష్ణునితో సమానంగా ఎంచి సత్కరించాలి. మండనుడా తరువాత మర్యాదగా ఆచార్యుని ఆహ్వానించి భోజనం చేయమని కోరాడు. ఆచార్యులు "విద్వన్మణీ, నేను భోజనం చేయటానికి రాలేదు ఇక్కడికి. మీతో

వాగ్వివాదమే నేను కోరే భిక్ష. వేదాంతమే చరమావధి అని నేల నాలుగు చెరగులా చాటటమే నా లక్ష్యం. వేదాంతాన్ని మరచినవారు కేవలం కర్మలతో, క్రతువులతోనే, కాలం వ్యర్థపుచ్చుతారు. వీటి వల్ల సంసార బంధం వీడదు. వేదాంతమే పరమోత్కృష్టమని మీరంగీకరిస్తే ఇక వాదనే అవసరముండదు. మీరంగీకరింపకపోతే మనం వాదించుకొందాం. ఓడినవారు రెండవ పక్షం చేరాలని నియమం పెట్టుకుందాం" అన్నారు.

"తప్పకుండా చర్చని ఏర్పాటు చేసుకుందాం. ఆఖరికి ఆదిశేషుడు కూడా నన్ను వాగ్వివాదంలో ఓడించలేడు నీ వొక లెక్కా? నీ బోధనల లోని లోపాలను ఎత్తిచూపే అవకాశం నాకు వస్తుంది. ప్రతిభావంతుడైన ప్రత్యర్థులతో వాగ్వివాదం జరపాలనే నా కోర్కె ఎప్పుడూను - నీ రాకకి నా స్వాగతం. నీవూ, నీ శిష్యులూ వాగ్వివాదం కొనసాగినంతకాలమూ నా అతిథులుగా ఉండండి. వివాదాన్ని రేపు మొదలుపెట్టుదాం."

ఇటువంటి వాదనలకి ఒక సంచాలకుడుండి వాదనా రీతిని గమనించి, చివరకు ఎవరు నెగ్గారో తీర్పు ఇవ్వటం సంప్రదాయం. అందువల్ల అక్కడ ఉన్న ఇద్దరు ఋషులనూ ఈ భారాన్ని నిర్వహించమని మండనుడు కోరాడు. వారు మర్యాదగా ఈ ఆహ్వానాన్ని కాదని, భారతికే ఆ గౌరవం దక్కాలన్నారు. ఆచార్యుల వారు ఈ సూచనను వెంటనే అంగీకరించారు.

మేమంతా బయట ఆత్రుతగా ఉన్నచోటుకి వచ్చారు ఆచార్యులు. మండనునితో తన సంభాషణను సరదాగా వివరిస్తూ ఆ మర్నాడే వాదన ప్రారంభమవుతుందని చెప్పారు. *(సశేషం)*

- రచయిత: హైదరాబాదు రమణకేంద్రంలో భక్తులు

**'నేను'గా మాత్రమే 'నేను' నిలిచి ఉంటే అదే ఆత్మ. దారి మళ్ళి 'ఇది' అని అంటే అది అహంత. - శ్రీ రమణ మహర్షి**

# గుఱ్ఱం సుబ్బరామయ్య

- పామరాజు వెంకట లావణ్య రావు

భగవాన్ శ్రీ రమణ మహర్షికి అత్యంత సన్నిహితుడు, అంకిత భక్తుడు గుఱ్ఱం వెంకట సుబ్బరామయ్య. భగవాన్ మహా నిర్యాణానికి 10 రోజుల ముందు ఆయన భగవాన్ పడుకొని ఉన్న గది గడప ముందు నిలబడి నమస్కారం చేసుకోగానే భగవాన్ ఆయనను లోపలకు పిలిచి, నీకేం కావాలి అని అడిగారు. "నాకు అభయం కావాలి" అన్నాడు అశ్రు నయనాలతో, ఆయన. వెంటనే భగవాన్ "సరే ఇచ్చాను" అన్నారు. అలాంటి అపూర్వ ఆశీర్వాదాన్ని పొందినవాడు సుబ్బరామయ్య.

ఆయన నెల్లూరు జిల్లా కృష్ణాపట్నం గ్రామంలో సం॥ 1899, అక్టోబరులో గుఱ్ఱం వెంకట సుబ్బయ్య, మంగమ్మ పుణ్య దంపతులకు జన్మించారు. తల్లి విద్యావంతురాలై ఉండి, బిడ్డకు ఇంగ్లీషు తొలి పాఠాలు నేర్పింది. మద్రాసు యూనివర్శిటీలో ఇంగ్లీషు లిటరేచర్‌లో ఎమ్.ఏ. (హానర్స్) పట్టా పొందారు. తెలుగు సంస్కృతంలో కూడా విశేష ప్రావీణ్యం కలిగినవారే కాక ఉత్తమ విద్యావేత్తగా ఖ్యాతి గాంచారు. భగవాన్ ఆదేశం మేరకు తమిళ భాషను కూడా నేర్చుకొన్నారు. 1926 సం॥ నుంచి 1956 సం॥ వరకు నెల్లూరు వి.ఆర్. కాలేజీలో ఇంగ్లీషు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా పనిచేశారు. 1956 నుంచి 1965 సం॥ వరకు నిడుబ్రోలు పి.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. షేక్స్‌పియర్ నాటకాలు చక్కని అభినయంతో బోధించి విద్యార్థులను ఆకట్టుకొనేవారు. జూలియస్ సీజర్ నాటకాన్ని వారి నుంచి వి.ఆర్. కాలేజి ఇంటర్‌మీడియట్ తరగతిలో విన్న అదృష్టం ఈ రచయితకు దక్కింది. కాళిదాసు మేఘ సందేశాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించారు. మహాభారతాన్ని ఆంగ్లం లోకి

అనువదించారు. స్వర్గారోహణ పర్వం పూర్తయ్యేసరికి వారి తల్లి స్వర్గస్థు రాలవడం విశేషం. ఆంగ్ల భారతాన్ని కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖర సరస్వతి పరమాచార్యులకు అంకితమిచ్చారు. సుబ్బరామయ్య మంచి కవి, రచయిత, బహు భాషా పండితుడే గాక మంచి వక్త కూడా. నెల్లూరు, రాయజీ వీధిలోని శంకరమఠంలోను, నెల్లూరు రేబాల లక్ష్మీ నరసారెడ్డి పురమందిరంలోనూ అనేక సాహిత్య, వేదాంత ఉపన్యాసాలనిచ్చేవారు. నెల్లూరు వర్ధమాన సమాజానికి కార్యదర్శిగా పనిచేశారు.

1933 సం॥ జూన్ 8వ తేది, మొదటిసారిగా అరుణాచలం వెళ్ళి భగవాన్ రమణ మహర్షిని దర్శించారు. కొన్ని మాసాల క్రిందట తన రెండేళ్ళ ముద్దుల కుమారుడు మరణించినందువల్ల దుః ఖభారోపశమనం కోసం భగవాన్ సన్నిధిని చేరారు. అంతకు పూర్వం రెండు సంవత్సరాల నుంచి ఆశ్రమ ప్రచురణలను, ఉపదేశసారాన్ని చదువుతుండేవారు. జన్మతః తమిళులైన శ్రీరమణులు అంత భావ గంభీరం, శైలి సౌలభ్యం, సుందరమైన పదాల పొందిక కల ఉపదేశ సారాన్ని తెలుగులో రచించి నందుచేత వారు దివ్యశక్తిగలవారై ఉంటారని భావించి భగవాన్ చెంత చేరారు. భగవాన్ కరుణాపూరిత మైన అనుగ్రహ దృష్టివారిపై ప్రసరించగానే, శాంతి సాగరంలో మునిగి నట్లైంది. భగవాన్ తన సద్గురువు, తల్లి, తండ్రి తన సర్వస్వం అని గ్రహించారు. అప్పుడు భగవాన్‌తో తన సందేహాన్ని వెలిబుచ్చారు. భగవద్గీతలోని వాసాంసి జీర్ణాని యథావిహాయ, నవాని గృహ్ణాతి నరోపరాణి, తథాశరీరాణి విహాయ, జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥ అనే శ్లోకంలో శరీరం శిథిలమైనప్పుడు, మనుషులు చినిగి పోయిన దుస్తులను వదలి కొత్తవి ధరించినట్లు నూతన శరీరాన్ని ధరిస్తారు అన్నారు కదా, మరి చిన్న పిల్లల శరీరం జీర్ణం కాదు కదా పై

శ్లోకం ఎట్లా వర్తిస్తుంది అని అడిగారు సుబ్బరామయ్య. అప్పుడు భగవాన్ "బిడ్డ దేహం శిథిలం కాలేదని నీకెలా తెలుసు? అది బయటకు కన్పించక పోవచ్చు. శరీరం పాడవనిదే చావురాదు. అది ప్రకృతి ధర్మం" సెలవిచ్చారు. భగవాన్ కరుణాపూరిత వాక్కులతో సుబ్బరామయ్య సంశయం తీరి దుఃఖం నుంచి ఉపశమనం లభించింది. అలా మరికొన్ని ప్రశ్నలడిగి తన సందేహాలను తీర్చుకొని ఆయన తన ఊరికి వెళ్ళిపోయారు. 1936 సం॥లో గ్రిద్దలూరు సాంబశివరావు గారి పరిచయ లేఖతో తిరిగి భగవాన్‌ను దర్శించారు. భగవాన్ లేఖ ఎందుకు? మీరు పరిచయస్థులే కదా అని అన్నారు.

దాంతో సుబ్బరామయ్య సంబరపడి భగవానులపై గురి పెరిగి తన తండ్రి వలె భావించి చనువుగా ఉండసాగారు. అంతకు పూర్వం ఒక మహనీయుడు ఆయనకు రెండు మంత్రాలను ఉపదేశించాడు. ఆశ్రమానికి వచ్చిన తర్వాత ఉపదేష్ట ఆదేశించినట్లు జపం సాగలేదు. కనుక భయమేస్తుందని భగవాన్‌తో మొరపెట్టుకొన్నారు. భగవాన్ మాత్రం ఆ మంత్రబలమే ఆయనను అక్కడికి తీసుకు వచ్చిందని ఇంక ఆ మంత్ర జపం అవసరం లేదని అభయమిచ్చారు. తర్వాత మరొక సమస్య వచ్చింది. పూర్వం రామతీర్థస్వామి వారి చేత చెప్పబడ్డ విధంగా ప్రతిదినం ఒక నిర్ణీత సమయంలో సుబ్బరామయ్య ప్రాణాయామాన్ని అభ్యాసం చేసేవారు. ఒక రోజు తల ముక్కలవు తున్నట్లు బాధ కలిగింది. అభ్యాసం నిలిపివేసినా అదే సమయానికి బాధ కలిగేది. తన సమస్యను భగవాన్ ఒంటరిగా ఉన్నప్పుడు విన్నవించుకొన్నాడు. సమాధానంగా భగవాన్ యోగాభ్యాసం చేసేవారికి అలాంటి అనుభవాలు సాధారణమేనని, అలాంటి బాధ కలిగినపుడు తనను తల్చుకోమని భగవాన్ చెప్పారు. అప్పటి నుంచి ఆ బాధ నుంచి విముక్తి లభించింది ఆయనకు. కేవలం ఆధ్యాత్మిక విషయాలలోకాక లౌకిక విషయాలలో కూడా భగవాన్ సహాయం అందేది ఆయనకు.

పల్లెటూరులో పెరిగే ఆయన చిన్న కూతురు ఇందిరకు మూర్ఛ వస్తుండేది. ఒకసారి తీవ్ర మయింది. ఆయుర్వేద వైద్యుల కోసం ప్రయత్నిస్తే దొరకలేదు. అప్పుడు భగవాన్ పటం ముందు మోకరిల్లి ప్రార్థించి, అనుగ్రహాన్ని అర్థిస్తూ ఆశ్రమానికి టెలిగ్రాం పంపారు. టెలిగ్రాం సరిగ్గా 7 గం॥లకు చేరి భగవాన్ దృష్టికి వచ్చింది. సరిగ్గా అదే సమయానికి సుబ్బరామయ్యగారి బావగారు తన దగ్గరున్న రమణుల ప్రసాదాన్ని తీసుకు వచ్చి ఇచ్చారు. అప్పుడే ఇద్దరు ఆయుర్వేద వైద్యులు వచ్చి చికిత్స చేశారు. ఇందిరకు ప్రాణాపాయం తప్పింది.

కొంతకాలం తర్వాత సుబ్బరామయ్య ఆశ్రమానికి వచ్చినపుడు భగవాన్‌తో మీరు టెలిగ్రాం చూచి నా బిడ్డకు స్వస్థత చేకూరాలని అనుకున్నారా అని అడిగారు. సమాధానంగా భగవాన్ బిడ్డ కోలుకోవాలని అనుకోవడం కూడా ఒక సంకల్పమే. ఏ విధమైన సంకల్పం ఉన్నా జ్ఞాని కాలేడు. జ్ఞాని దృష్టి దేనిమీదైనా పడితే దివ్య స్వతసిద్ధకార్యము Divine automatic action (ఈ ఇంగ్లీషు పదాలను భగవాన్ స్వయంగా ఉచ్చరించారు) బయలుదేరి ఉత్తమ శ్రేయస్సును చేకూరుస్తుంది అని చెప్పారు.

సుబ్బరామయ్య భగవాన్ దరి చేరినప్పటి నుంచి వారినే తల్లితండ్రి, గురువు, సర్వస్వంగా భావించారు. భగవాన్‌తో అత్యంత సన్నిహితంగా, చనువుగా మెలిగేవారు. కరుణాపూర్ణ సుధాబ్ధి అయిన భగవాన్ ఆయనను ప్రత్యేకంగా చూచేవారు. భగవాన్ రాత్రి రెండున్నర గంటలకు లేచి, సుబ్బరామయ్య, సబ్ రిజిస్ట్రార్ నారాయణ అయ్యర్, కల్యాణ సుందరమయ్యర్‌లతో పాటు వంటశాలకు వెళ్ళి కూరలు తరగటం, చట్నీ రుబ్బడం, వంట పనీ చేసేవారు. పొయ్యి సెగకు భగవాన్‌కు చమట పడితే సుబ్బరామయ్య విసనకర్రతో విసిరేవారు. కాని భగవాన్ వారించేవారు. సుబ్బరామయ్య భగవాన్ కళ్ళు కప్పి వెనుక వైపు నుంచి విసురుతుంటే భగనాన్ నన్ను ఏమార్చి విసరే పని

చేస్తున్నారా? అది కూడా సరిగా చేయడం లేదని చెప్పి సుబ్బరామయ్య చెయ్యి పట్టుకుని విసనకర్రను ఎలా ఉపయోగించాలో నేర్పించారు. భగవాన్ కరస్పర్శ లభించగానే సుబ్బరామయ్య పులకితశరీరుడై ధన్యత పొందాడు. అలాగే ఆయన చేతిని పట్టుకొని రోకలితో చట్నీ ఎలా దంచాలో నేర్పించారు. చట్నీ తయారైన తర్వాత రుచి చూడమని ఉండలు చేసి వాళ్ళ చేతులు పనిలో నిమగ్నమయి ఉన్నందు వలన భగవానే వాళ్ళ నోళ్ళలో వేసేవారు. ఒకసారి చట్నీని సుబ్బరామయ్యకు ఇచ్చి రుచి చూడమన్నారు భగవాన్. ఆయన సంకోచిస్తూ "కొద్దిగా ఉప్పు తక్కువైనట్లుందన్నాడు" అన్నదే తడవుగా, భగవాన్ రెండు దోసెళ్ళ నిండా ఉప్పును కలిపారు. తక్కిన భక్తులందరూ చట్నీ సుబ్బరామయ్య వల్ల పాడైపోయిందని బాధపడ్డారు. కాని భోజనశాలలో ఇడ్లీలతో పాటు ఆరగిస్తుంటే ఉప్పగా అనిపించక పోగా, ఎంతో కమ్మగా ఉంది. మరొకసారి భగవాన్ కాకరకాయ పచ్చడి చేశారు. చేదుగా లేదు. బాగా రుచిగా ఉండింది. కాకరకాయ లోని చేదు, చట్నీలోను ఉప్పు తమ సహజ గుణాలను కోల్పోయినట్లే మానవులలో అహం నశించాలని సూచించడమే దీనిలోని గూడార్థం. కాకరకాయ పచ్చడి మీద సుబ్బరామయ్య ఆశువుగా ఒక పద్యం కూడా చెప్పారు.

సుబ్బరామయ్యకు భగవాన్ అంటే విశిష్టమైన అభిప్రాయం ఉండేది. నిర్దిష్టమైన ఉదాహరణలతో, స్పష్టమైన భాషలో, అధికార స్వరంతో, స్ఫటికమంత నాణ్యతతో తన బోధనలను తెలియ చెప్పే మహోన్నత గురుసార్వభౌములు భగవాన్ అనేవారు ఆయన. వారి పలుకులు తన స్వంత అనుభవం నుండి, స్వయంగా గడించిన జ్ఞానం నుండి వెలువడి నవేగాని పుస్తకాలు చదివో, కర్ణాకర్ణిగా విన్నవో కాదు. ఒకనాటి ప్రొద్దున భగవాన్ ఆత్మసాక్షాత్కారము కోసం గుర్వనుగ్రహం గురించి వివరణ ఇచ్చారు. ఆత్మ సాక్షాత్కారము కావలసినది ఎవరికి అని ఎవరైనా విచారణ చేస్తే ప్రత్యేక వ్యక్తిత్వం నశించి, ఇంకా ఆత్మసాక్షాత్కారం

కావాలి అనే భ్రమ వీడిపోతుంది. అది గుర్వనుగ్రహం వల్లనే సాధ్య మవుతుంది. ఆత్మ ఇంకా సాక్షాత్కరింపలేదు అనే భ్రమను వదలించడమే గాని, ఆత్మ సాక్షాత్కారాన్ని ప్రసాదించడం గురువుకే కాదు, ఈశ్వరునికి కూడా సాధ్యం కాదు. ఆత్మ సాక్షాత్కారాన్ని కలిగించ మని గురువుని కోరడం నన్ను నాకు ఇవ్వండి అని అడిగినట్లుంటుంది. దేహాత్మ బుద్ధి వలన నేను ప్రత్యేక వ్యక్తిని అనే భ్రమ ఉండటం వల్ల గురువు నాకన్నా భిన్నమైన వ్యక్తి అనే భ్రమ కలుగుతున్నది. గురువు ఆత్మ కన్నా వేరు కాదు. మరొకసారి వేకువ సమయంలో మనకు ప్రత్యగాత్మ ఎలా ద్యోతకమవుతుందో భగవాన్ సుబ్బరామయ్యకు వివరించారు. నిద్రనుంచి పూర్తిగా మెలకువలోకి రాబోయే మధ్య కాలంలో ఒక్క క్షణం కొద్ది వెలుగు మాత్రం ఉంటుంది. తర్వాత నేను ఆలోచన మొదలవుతుంది. నేను అనే ఆలోచన మొదలుగాక పూర్వం ఎఱుక ఉంటుంది. తర్వాత నేను అనే తలంపుతో పరిసరాలు చూడ గల్గుతాము. కాబట్టి ఆ ఒక్క క్షణికమే మనం శుద్ధ చైతన్యాన్ని అనుభవించ గలుగుతాము.

వేరొకసారి మౌనాన్ని గురించి శ్రీరమణులు ఇట్లా సెలవిచ్చారు. మౌనం నాలుగు విధాలు. 1. వాఙ్మౌనము. 2. నేత్రమౌనము. 3. కర్ణ మౌనము. 4. మానసిక మౌనము. వాటిలో చివరిదే శుద్ధ మౌనము. అదే ప్రధానమైనది. మౌనవ్యాఖ్యే ఉత్తమ వ్యాఖ్య. కనుకనే శంకరా చార్యులవారు "మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం" అన్నారు, ఆదిగురువు దక్షిణామూర్తిని గురించి. మౌనమే అఖండ వాక్కు. ఒక్క మాట. అదే రెండు హృదయాల మౌన భాషణం. మౌనం నిరంతర విద్యుత్ప్రవాహం లాంటిది. మనం ఎలాగైతే దీపాలను వెలిగించటం కోసం ఆ విద్యుత్ప్రవాహాన్ని అడ్డుకుంటామో అలాగే వాక్కు మౌనాన్ని అడ్డగిస్తుంది. జ్ఞాని ఎంత మాట్లాడినప్పటికీ మౌనిగానే ఉంటాడు. ఎంత చేసినప్పటికీ చేయనివాడే. అతని వాక్కు అశరీర వాక్కు.

సుబ్బరామయ్య తన పాండిత్య పటిమను అనేక కోణాల్లో భగవాన్‌కు సమర్పించారు. కావ్యకంఠ మహాముని రచించిన రమణగీతను, చత్వారింశత్‌ను, దైవరాతుడు రచించిన విభక్త్యష్టకాలను తెలుగులోకి అనువదించారు. భగవద్గీతలోని ముఖ్యమైన 42 శ్లోకాలను, సుబ్బరామయ్య ప్రార్థన మేరకు, భగవాన్ భగవద్గీతాసారం అనే పేరుతో ప్రత్యేకంగా కూర్చారు. దాన్ని సుబ్బరామయ్య తెలుగులోకి అనువదించారు. తమిళంలోని వెణ్బాం ఛందస్సును భగవాన్ తెలుగులోకి (ఏకాత్మపంచకం) ప్రవేశపెట్టిన స్ఫూర్తితో భగవాన్ రచించిన అరుణాచల పంచరత్నాలను ఆదిశంకరుల ఆత్మబోధను ఆయన తెలుగులో వెణ్బా ఛందస్సులో రచించారు. భగవాన్‌తో తన అనుబంధాన్ని, భగవాన్ విశిష్ఠతను చాటిచెప్పే విధంగా ఆంగ్లంలో రెమినిసెన్సెస్ ఆఫ్ రమణ, తెలుగులో రమణ స్మరణామృతము అనే గ్రంథాలను రచించారు. పాకశాలలో కల్గిన పని అనుభవాలను, ఇతర సందర్భాలలో కల్గిన అనుభవాలనుద్దేశించి కూడా తెలుగులో పద్యాలు వ్రాశారు. కాకరకాయ పచ్చడి మీద, తాంబూలం మానేసినపుడు తాంబూల విలాపం, పాకశాలకు పోవడం మానినపుడు పాకశాలా విలాపం వంటి పద్యాలను వ్రాశారు. అనేక విధాలుగా ఇతర భాషల లోని రచనలను తెలుగులోనికి అనువాదం చేశారు.

సుబ్బరామయ్య ఒకసారి తన ఇద్దరు కుమార్తెలు లలిత (9 సం॥), ఇందిర (5 సం॥) లతో, ఆశ్రమానికి వచ్చినపుడు ఆ పిల్లలకు, భగవాన్, ఆటపాటలకు పూర్తి స్వేచ్ఛ నిచ్చేవారు. ఒకనాడు ఇందిర, తెలుగు ఉపదేశసారం పుస్తకము పేజీలు త్రిప్పుతూ, 'దేహం మృణ్మయవత్' అనే భగవానుల సంస్కృత శ్లోకం నాలుగు చరణాలలో పెద్దవిగా అచ్చు వేయబడిన మొదటి రెండు అక్షరాలను కలుపుకొని దేహం - నాహం - కోహం - సోహం అని పెద్దగా చదివింది. అది విని భగవాన్ వేదాంత సారాన్ని అందించే మాటలు అవి. వీటినే మంత్రంగా జపం చేయ

మన్నారు. ఇందిర ఆరోగ్యవంతురాలు కాదు. చివరకు మశూచితో 1943లో మరణించింది. అప్పుడు ఆమె సమాధిపై దేహం - నాహం - కోహం - సోహం అని చెక్కించారు సుబ్బరామయ్య. వీరి సతీమణి 1941లో భగవాన్‌లో ఐక్యమయ్యారు.

దానధర్మాలు చేసేటప్పుడు రచనలను ప్రచురించేటప్పుడు తమ పేరు వేయవద్దని కొంతమంది చెపుతూ ఉంటారు. అలాంటి సందర్భమే సుబ్బరామయ్య జీవితంలో ఎదురైంది. తెలుగు రమణగీతను ముద్రించే పనిలో వేదం అనంతాచారి అనే భక్తుడు మిక్కిలి శ్రద్ధతో సహకారాన్ని అందించాడు. ఆయన పేరును కూడా సహకరించినవారితో పాటు పీఠికలో ప్రచురించారు. కాని ఆయన తన పేరును తొలగించమని భగవాన్‌ను వేడుకొన్నాడు. అప్పుడు భగవాన్ పేరు వేయమని కోరడం ఎంత అహంకారమో, పేరు వేయవద్దని అడగడం కూడా అంత అహంకారమే అని చెప్పి దానిని అలాగే ఉండి పోనీ, అనంతాచారి అంటే ఎవరికి తెలుసు? అని అన్నారు. అలా భగవాన్ సందేశాలెన్నో సుబ్బరామయ్య ద్వారా మనకు లభించాయి.

సుబ్బరామయ్య కేవలం సాహిత్యపరమైన విషయాలలోనే కాక ఆశ్రమ నిర్వహణ కార్యకలాపాలలో కూడా పాలుపంచుకొనేవారు. 1949 సం॥లో ఆశ్రమంలో మాతృభూతేశ్వరాలయంలో కుంబాభిషేకానికి గ్రిద్దలూరు సాంబశివరావుతో కలిసి నెల్లూరు జిల్లాలో 20 పుట్ల ధాన్యాన్ని సేకరించి ఆశ్రమానికి అందించారు. భగవాన్ మహా నిర్యాణం తర్వాత 1950 ఏప్రిల్ 24న జరిగిన కుంబాభిషేకానికి కూడా కొన్ని పుట్ల ధాన్యాన్ని సేకరించి అందించారు. 1970 సం॥లో ఆయన భగనాన్‌లో లీనమయ్యారు.)

*(సౌజన్యం/కృతజ్ఞతలు: శ్రీ రావినూతలన శ్రీరాములు వ్యాసం, గుఱ్ఱం సుబ్బరామయ్యగారి రమణ స్మరణామృతము, రమణ పెరియ పురాణం)*

# భగవాన్ ఉపదేశసారము - గణపతి ముని వ్యాఖ్యానము

- పింగళి సూర్యసుందరం

భగవాన్ శ్రీరమణమహర్షి అనుగ్రహించిన ''ఉపదేశసారము'' సంస్కృత శ్లోకాలను చూచి సంస్కృత పండితుడూ, ఆశుకవీ కూడా అయిన కావ్యకంఠ గణపతి ముని చకితుడై తోటి సంస్కృత విద్వాంసులతో ఇట్లా అన్నారు: ''మనమంతా సంస్కృత కవులమని చెప్పుకుంటాం, ఇంత అద్భుతంగా కవిత చెప్పగలమా'' అని. ఆధ్యాత్మిక విషయాన్ని ఇంత సులభగ్రాహ్యంగా సంస్కృతంలో ఇంకెవ్వరూ చెప్పలేదని ప్రతీతి. ''ఉపదేశసార గ్రంథానికి గణపతి ముని వ్యాఖ్యానం రాశారు. ఆ వ్యాఖ్యానానికి అనువాదమిది.

1వ శ్లోకం: కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలమ్ ।
కర్మకిం పరం? కర్మత జ్జడం ॥

అర్థం: కర్మయొక్క ఫలం, ఆ కర్మకి కర్త అయిన వాని (పరమాత్ముని) వలనే లభిస్తుంది. అట్టియెడ కర్మే పరమవుతుందా? కర్మ కేవలం జడమే:

వ్యాఖ్యానం: మీమాంసకుల దృష్టిలో కర్మాచరణ యొక్క ప్రాముఖ్యం ఫలితాన్నివ్వడంలోనే ఉంది. ఈ సిద్ధాంతాన్నిక్కడ శ్రీ భగవాన్ త్రోసిపుచ్చుతున్నారు. ఏ కార్యానికైనా ప్రతిఫలం, ఆ కార్యానికి ప్రధాన కర్త (అంటే భగవంతుడు) వల్లనే లభిస్తుంది. అందువల్ల కార్యమే ప్రధానమా? కానే కాదని ఇక్కడి భావం. కార్యం జడం. కార్యం జడమన డంలోని అంతరార్థమిది. కార్యమే పరంకాదని చెప్పడమే. దీనినే, ఇంకో విధంగా చెప్పాలంటే, కార్యం జడమవడం వల్ల అది పరమోన్నతం కాజాలదు. మనమిక్కడ కార్యం యొక్క ప్రాముఖ్యతని గురించి మాట్లాడటం లేదు. మనం చెప్పేదల్లా ఇదే! కార్యం అపూర్వం కనుకనే ఫలితాన్నిచ్చే సామర్థ్యం కలిగి ఉన్నది. ఈ కారణంగానే సాధికారమైన వేదవాక్కులకు అర్థమంటూ ఒకటి ఉంది.

ఈ దృక్పథం కూడా సరియైనది కాదు. "జ్యోతిస్తోమ వంటి యజ్ఞాలు స్వర్గంలో స్థానం కల్పిస్తాయి" వంటి వాక్కుల అర్థమీ మేరకే: భగవంతుడు, చేసిన కార్యానికి, మంచివో, చెడువో, ఫలితాలని అనుగ్రహిస్తాడనే.

